# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 27-07-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ విపక్షాల ఆందోళనలనడుమ పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

❖ పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రవేశ పెట్టిన బిల్లుపై చర్చించేందుకు విపక్షాలు సహకరించకపోవడం సరికాదని కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు అన్నారు.

❖ ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ లో భారత షూటర్లు ఈరోజు రెండు పతకాలను గెలుచుకున్నారు.

❖ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డి) తెలిపింది.

===============

విపక్షాల ఆందోళనల నడుమ పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. పరీక్షల నిర్వహణలో అవకతవకలు నివారించే సవరణ బిల్లు2026ను లోక్‌సభలో ఈరోజు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పరీక్షల అవకతవకల నివారణ చట్టం, 2024ను సవరించడానికి ఉద్దేశించబడింది. విపక్షాల ఆందోళనలు కొనసాగుతుండగానే.. కేంద్ర ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లు దేశంలోని కోట్లాది మంది యువత భవిష్యత్, ఆకాంక్షలతో ముడిపడి ఉందని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. పేపర్ లీకేజ్ వంటి నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి, బాధ్యులపై కఠినమైన శిక్షలు అమలు చేయడానికి ఈ బిల్లు ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

కాగా ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభను అడ్డుకోవడంతో మరోసారి స్పీకర్ ఓం బిర్లా సభను సాయంత్రం 5 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా చర్చ చేపట్టకుండా విపక్షాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఇదే విషయంపై రాజ్యసభను కూడా రేపు ఉదయం 11 గంటల వరకు వాయిదా వేశారు. సాయంత్రం 5 గంటల 15 నిమిషాలకు నాల్గవ వాయిదా అనంతరం రాజ్యసభ సమావేశమైనప్పుడు.. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ సభలో కార్యకలాపాలు చేపట్టడానికి ప్రయత్నించినప్పటికీ ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో రేపటికి వాయిదా వేశారు. సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్న ప్రతిపక్ష పార్టీల ప్రవర్తనను పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ... కాంగ్రెస్ ఇప్పటికీ సహకరించడం లేదని ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమను పార్లమెంట్‌లో మాట్లాడానికి అనుమతించడం లేదని బయట విలేకరులతో చెబుతున్నారని, కానీ ప్రభుత్వం చర్చలో పాల్గొనమని కోరుతున్నప్పటికీ వారు అలా చేయడం లేదని ఆయన వివరించారు. ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గట్టి వైఖరి తీసుకున్నారని కిరెన్ రిజిజు పేర్కొంటూ..

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = =

అయోధ్య రామమందిరం విరాళాల చోరీ, దుర్వినియోగం ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తాము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా రామ మందిర విరాళాల చోరీ కేసులో నిందితులుగా ఉన్న ఎనిమిది మందికి ఉత్తరప్రదేశ్‌లోని ప్రత్యేక న్యాయస్థానం ఈరోజు జ్యుడిషియల్ కస్టడీని 14 రోజులకు పొడిగించింది.

విరామం

= = = = = = = = = = = = = = =

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (CRPF) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ CRPF సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అసాధారణ ధైర్యం, అచంచలమైన అంకితభావం, అత్యున్నత వృత్తి నైపుణ్య ప్రమాణాలతో, దేశ ఐక్యత, సమగ్రత, అంతర్గత భద్రతను కాపాడటంలో CRPF అమూల్యమైన సహకారం అందించిందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సామాజిక మధ్యమంలో పేర్కొన్నారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది శౌర్యం, త్యాగం, విధి పట్ల స్థిరమైన అంకితభావానికి యావత్ దేశం వారికి వందనం చేస్తుందన్నారు. సీఆర్పీఎఫ్ తన అచంచలమైన ధైర్యం, విధి పట్ల నిబద్ధతతో ప్రత్యేకతను చాటుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అంతర్గత భద్రతను కాపాడటం నుండి క్లిష్ట పరిస్థితులలో పౌరులకు సేవ చేయడం వరకు.. సీఆర్పీఎఫ్ సిబ్బంది ఎల్లప్పుడూ దేశానికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారని ప్రధాని పేర్కొన్నారు. మావోయిజాన్ని నిర్మూలించడంలో వారి ప్రయత్నాలు ప్రత్యేకంగా ప్రశంసనీయమని, అవి ఎందరో ప్రజల జీవితాలలో శాంతి, పురోగతికి దోహదపడ్డాయని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

===============

సంత్ గురు రవిదాస్ 650వ జయంతిని `సమరస్య సంకల్ప అభియాన్`గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక పత్రికా సమావేశంలో బీజేపీ పార్లమెంట్ సభ్యులు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ మాట్లాడుతూ... ఈ నెల 29న జరిగే గురు పౌర్ణమి పవిత్ర దినం నుండి `సంత్ గురు రవిదాస్ జీ మహారాజ్ సమరస్య సంకల్ప అభియాన్` పేరుతో ఏడు నెలల పాటు జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 20న జరిగే సంత్ గురు రవిదాస్ జయంతి వరకు ఈ ప్రచార కార్యక్రమం కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. వారణాసిలోని సంత్ గురు రవిదాస్ జన్మస్థలంలో రేపు 131 కళాశాలకు పూజలు నిర్వహించి.. భారీ ఊరేగింపు నిర్వహిస్తారని తరుణ్ చుగ్ తెలియజేశారు.

===============

చైనాలోని హాంగ్‌జౌ నగరం వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్లు సత్తాచాటారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో ఈషా సింగ్ స్వర్ణ పతకం సాధించగా... మను భాకర్ కాంస్య పతకం గెలుచుకున్నారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్లో ఈషా సింగ్ ఆధిపత్యం ప్రదర్శించి.. 40 హిట్స్‌తో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు తీవ్ర పోటీ నడుమ షూట్-ఆఫ్‌ను దాటుకుని వచ్చిన మను బాకర్ 28 హిట్స్‌తో మూడో స్థానంలో నిలిచి కాంస్యాన్ని సొంతం చేసుకుంది. పతకాలు సాధించిన ఈషా సింగ్, మను భాకర్ లకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు తెలిపారు. వారి అద్భుత ప్రదర్శన షూటింగ్‌లో భారతదేశ ఆధిపత్యాన్ని, దేశ క్రీడా వ్యవస్థకు పెరుగుతున్న బలాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

===============

కామన్వెల్త్ క్రీడల్లో భారత్ వెయిట్‌లిఫ్టింగ్‌లో మరో పతకం సాధించింది. మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 53 కేజీల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ రజత పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తిన జ్ఞానేశ్వరి.. క్లీన్ అండ్ జెర్క్ 111 కేజీలు మోసి, మొత్తంగా 199 కేజీలతో రెండో స్థానంలో నిలిచింది. దీంతో ఇప్పటివరకు భారత్ ఒక స్వర్ణం, మూడు రజతాలు, ఒక కాంస్యంతో మొత్తం ఐదు పతకాలు సొంతం చేసుకుంది. కాగా భారత స్విమ్మర్ సజన్ ప్రకాష్ గ్లాస్గోలో కామన్వెల్త్ క్రీడల్లో ఈరోజు జరిగిన పురుషుల 200 మీటర్ల బటర్‌ఫ్లై హీట్స్‌లో ఆరో వేగవంతమైన స్విమ్మర్‌గా నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు.

===============

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డి) తెలిపింది. అలాగే ఒడిశాలో ఈరోజు భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈనేపథ్యంలో రెడ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. అలాగే ఢిల్లీ, చండీగఢ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, విదర్భలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎమ్‌డి వెల్లడించింది. ఈరోజు, రేపు ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఉత్తరాంధ్రలలో సముద్ర తీరంలోకి వేటకు వెళ్లరాదని ఐఎమ్‌డి మత్స్యకారులకు సూచించింది.

===============
===============